అక్క చెల్లెమ్మలకు ఆర్థిక ఆసరా

- రెండు నియోజవర్గాల్లో కలిపి 9,606 డ్వాక్రా గ్రూపులకు లబ్ధి
- మహిళలకు రూ.304 కోట్ల సాయం అందజేత


ఆసరా నిధుల విడుదల సందర్భంగా సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

అమలాపురం రూరల్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప పాదయాత్రలో అక్క చెల్లెమ్మల కష్టాలను కళ్లారా చూసి వారి జీవితాల్లో వెలుగులు నింపాలనే సంకల్పంతో అధికారంలోకి రాగానే రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చారు. చెప్పినట్లుగానే అధికారంలోకి వచ్చిన వెంటనే ఆసరా డ్వాక్రా రుణమాఫీ పథకాన్ని ప్రవేశపెట్టారు. డ్వాక్రా సంఘాలపై 2019 ఏప్రిల్ 11 నాటికి ఉన్న రుణ నిల్వలు నాలుగు వాయిదాల్లో ప్రభుత్వమే పూర్తిగా చెల్లిస్తుందని ప్రకటించారు. ఇచ్చిన మాట ప్రకారంగా నాలుగేళ్ల కాల వ్యవధిలో నాలుగు విడతల్లో రుణ మాఫీ సొమ్మును చెల్లించి మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు సాయమందించారు. ఈ ఏడాది జనవరి 23న బటన్ నొక్కి నాలుగో విడత సాయాన్ని అక్క చెల్లెమ్మల ఖాతాల్లో వేశారు. అర్హత కలిగిన డ్వాక్రా గ్రూపులన్నింటికీ ఆయా ఖాతాల్లో రుణమాఫీ సొమ్ము జమైంది.

అమలాపురం నియోజకవర్గంలోని అమలాపురం, అల్లవరం, ఉప్పలగుప్తం మండలాల్లోని 4,422 గ్రూపులకు గాను రూ.148.04 కోట్లు, ముమ్మిడివరం నియోజకవర్గంలోని ముమ్మిడివరం, తాళ్లరేవు, ఐ.పోలవరం మండలాల్లోని 3,502 గ్రూపులకు గాను రూ.155.97 కోట్లు అక్క చెల్లమ్మలకు అందించారు. అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల మండల కేంద్రాల్లో ఏర్పాటుచేసిన సభల్లో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌ల చేతుల మీదుగా మహిళలకు నమూనా చెక్కులు అందించారు. వైఎస్సార్ ఆసరా ఉత్సవాలను నిర్వహించి డ్వాక్రా సంఘాల అకౌంట్లకు మాఫీ సొమ్మును ప్రభుత్వం జమ చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన మాట నిలబెట్టుకుని రుణ మాఫీ చేయడంపై మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నాలుగు విడతల్లో మహిళా సంఘాలకు కలిగిన లబ్ధి

మండలం	గ్రూపులు	లబ్ధి (రూ.కోట్లలో)
అమలాపురం	1,817	65.36
అల్లవరం	1,364	45.87
ఉప్పలగుప్తం	1,243	36.82
ముమ్మిడివరం	980	28.26
ముమ్మిడివరం అర్బన్	450	14.96
కాట్రేనికోన	1,347	35.94
ఐ.పోలవరం	1,171	34.13
తాళ్లరేవు	1,234	42.66
మొత్తం	9,606	304

రుణమాఫీ హర్షణీయం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా సంఘాల మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా రుణ మాఫీ చేయడం హర్షణీయం. డ్వాక్రా రుణ మాఫీ ద్వారా మాకు అందిన రూ.58,800 సాయంతో గ్రామంలో ఫొటో స్టూడియో పెట్టుకుని ఉపాధి పొందుతున్నాం.
– గుత్తుల దుర్గ, ఎ.వేమవరప్పాడు, అమలాపురం మండలం

అర్హులందరికీ వర్తింపు



డ్వాక్రా సంఘాల్లో ఉన్న అర్హులైన మహిళలందరికీ వైఎస్సార్ ఆసరా పథకాన్ని వర్తింపజేశాం. ఒక్క అమలాపురం మండలంలోనే 1,817 సంఘాలకు రూ.65.36 కోట్ల మేర లబ్ధి చేకూరింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం నాలుగు విడతల్లో ఆసరా పథకాన్ని అందించారు.
– పీవీవీ రమణి, ఏపీఎం, వైఎస్సార్ క్రాంతి పథం, అమలాపురం రూరల్ మండలం

క్లుప్తంగా

రామాలయాలకు రూ.20 లక్షల టీటీడీ నిధులు


గ్రామస్తులకు నిధుల మంజూరైనట్లుగా ప్రొసీడింగ్ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ

ముమ్మిడివరం: మండలంలోని కర్రివానిరేవు, చింతావానిరేవు, బూరుగుపేటలో రామాలయాల నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి రూ.20 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు నిధుల మంజూరు ప్రొసీడింగ్ పత్రాలను టీటీడీ బోర్డు మెంబర్, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ గురువారం ఆయా గ్రామస్తులకు అందజేశారు. నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే పొన్నాడకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కాశి జగపతిరావు, చింతా నాగమునీంద్రరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేడు తానేల్లంకలో ఎన్నికల ప్రచారం

ముమ్మిడివరం: మండలంలోని తానేల్లంక పంచాయతీ పరిధి తానేల్లంక బాడవలో ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభించనున్నట్లు మండల పార్టీ కన్వీనర్ జగతా పద్మనాభం గురువారం తెలిపారు. ప్రచారంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, బూత్ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

డీసీసీబీ బ్రాంచి ప్యానల్ న్యాయవాదిగా సత్యనారాయణ


సత్యనారాయణను సత్కరిస్తున్న బార్ అసోసియేషన్ ప్రతినిధులు


అమలాపురం టౌన్: అమలాపురంలోని జిల్లా కేంద్ర కోఆపరేటివ్ బ్యాంక్(డీసీసీబీ) బ్రాంచ్ ప్యానల్ న్యాయవాదిగా ముడిదుడ్డి సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ సందర్భంగా గురువారం సాయంత్రం స్థానిక బార్ అసోసియేషన్ భవనంలో ఆయనను తోటి న్యాయవాదులు ఘనంగా సత్కరించారు. డీసీసీబీ బ్రాంచ్ ప్యానల్ న్యాయవాదిగా సత్యనారాయణ విజయవంతంగా సేవలందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రతినిధులు మాకిరెడ్డి ఆదినారాయణ, అడపా సత్యప్రసాద్, కూచిమంచి శశిధర్, కటికిదల సత్యనారాయణ, వెంపరాల భాస్కరశాస్త్రి, సంసాని అనిల్‌కుమార్, బడుగు జోగేష్, దాకారపు చిరంజీవి, దేవదీవెన తదితరులు పాల్గొన్నారు.

బీపీఎల్ క్రికెట్ విజేత మెకానికల్ జట్టు


విజేత జట్టుతో కళాశాల చైర్మన్ కృష్ణ సతీష్ తదితరులు

అమలాపురం రూరల్: భట్లపాలెం బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో బీపీఎల్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు బుధవారంతో ముగిశాయి. ఈ టోర్నమెంట్‌లో ఎనిమిది జట్లు పాల్గొన్నాయి. బుధవారం మెకానికల్–ఈసీఈ జట్ల మధ్య హోరాహోరీగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మెకానికల్ జట్టు విజయం సాధించింది. టోర్నమెంట్ అంపైర్లుగా యు.విక్రమ్, జె.సురేష్‌లు వ్యవహరించారు. ఫైనల్ మ్యాచ్‌కి ముఖ్య అతిథిగా కళాశాల చైర్మన్ బోనం కృష్ణ సతీష్ హాజరయ్యారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీజీ రామారావు, కళాశాల ఏఓ కృష్ణారావు, ఫిజికల్ డైరెక్టర్లు కె.రవిసుధీర్, మురళీకృష్ణ, రవణం మాధవి పాల్గొన్నారు.

కోలాహలంగా ప్రభ ఊరేగింపు


ప్రభ ఊరేగింపులో పాల్గొన్న యువకులు

మామిడికుదురు: గోగన్నమఠం గ్రామ శివారు తోటమెరకలో ఉన్న పెద్దింట్లమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా గురువారం ప్రభ ఊరేగింపు కోలాహలంగా జరిగింది. గరగ నృత్యాలు, బుట్టబొమ్మల ప్రదర్శన, బాణసంచా కాల్పులు, భక్తుల కోలాహలం నడుమ ప్రభ ఊరేగింపు జరిగాయి. భక్తులు రెట్టించిన ఉత్సాహంతో ఊరేగింపులో పాల్గొన్నారు. నెల రోజుల పాటు జరిగే జాతరలో భాగంగా బుధవారం రాత్రి అమ్మవారి కల్యాణం ఘనంగా జరిగింది. ఈ నెల 26న అమ్మవారి జాతర జరుగుతుంది.

వైఎస్సార్ సీపీకి ఓటు వేసి రుణం తీర్చుకుందాం


వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలని కోరుతున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అల్లవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల ద్వారా ఇంటింటికీ సంక్షేమాన్ని అందించారని, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓటు వేసి రుణం తీర్చుకుందామని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ పిలుపునిచ్చారు. బెండమూర్లంక జాంబవానిపేటలో గురువారం పార్టీ విజయం కోసం ఆయన మాదిగలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసే బాధ్యత మనపై ఉందని, ప్రతిఒక్కరూ ఆయన విజయం కోసం పనిచేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపారని చెప్పారు. 2014–19 మధ్య పాలించిన చంద్రబాబు 600 వందల హామీలను ఇచ్చి ఏ ఒక్కటీ నేరవేర్చలేదని ఎద్దేవా చేశారు. చంద్రబాబు మళ్లీ హామీల పేరిట ప్రజలను మోసం చేయడానికి ముందుకు వస్తున్నారని, ప్రజలు గుర్తించి ఆయన మోసాలను తిప్పికొట్టాలన్నారు. ఆయన వెంట రేవు శ్రీను, నవుంద్రు రమేష్, ముసునూరి రాజు, ముమ్మిడివరపు పెద్దిరాజు, ముసునూరి రత్నంరాజు, లూటుకుర్తి శ్రీను, ఉందుర్తి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మానవ మనుగడకు అడవులు దోహదం


విద్యార్థులతో మొక్కలు నాటిస్తున్న అటవీ శాఖ అధికారులు

తాళ్లరేవు: మానవుల మనుగడకు అడవులు ఎంతగానో దోహదపడతాయని, వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్ అన్నారు. గురువారం ప్రపంచ అటవీశాఖ దినోత్సవాన్ని పురస్కరించుకుని కోరంగి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఫారెస్ట్ రేంజర్ వరప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు, ప్రకృతి వైపరీత్యాల నుంచి ప్రజలను కాపాడేందుకు అడవుల పాత్ర ఎంతో కీలకమన్నారు. అనేక పక్షి, జంతు, మత్స్య జాతులకు కోరంగి అభయారణ్యం ఆవాసంగా ఉందన్నారు. తీర ప్రాంతానికి రక్షణ కవచంగా ఉన్న కోరంగి అభయారణ్యాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులచే మొక్కలు నాటించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు ఎం.నాగార్జున, ఎస్.వీరభద్రరావు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు జి.గోపి నాగేంద్రకుమార్, కె.మహేష్, కె.ధనుంజయరావు, ఎస్కేఎం సుభాని, పి.సంధ్యారాణి, పాఠశాల సిబ్బంది సుబ్రహ్మణ్యం, మహేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా కల్యాణం


స్వామివారి కల్యాణం జరుపుతున్న అర్చకులు


పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అశోక్ దంపతులు

యానాం: యానాంలో కొలువైన చారిత్రక రెడ్డి రాజుల కాలం నాటి శ్రీభూసమేత వేంకటేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవం గురువారం కన్నుల పండువగా జరిగింది. చింతా వెంకట సుబ్బారావు కుమారుడు నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు ఉత్సవదారులుగా బాలాలయంలో కల్యాణం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి కల్యాణాన్ని తిలకించారు. యానాం శాసన సభ్యులు గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, లక్ష్మీ స్నేహ దంపతులు స్వామి వారికి ముత్యాల తలంబ్రాలు, మంగళ సూత్రాలు సమర్పించారు. అదేవిధంగా పుదుచ్చేరి ప్రభుత్వం తరపున ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి దంపతులు స్వామివారికి పట్టు పీతాంబరాలు, స్వర్ణ యజ్ఞోపదేశం అందజేశారు. కల్యాణోత్సవాల్లో ఎమ్మెల్యే అశోక్ తల్లి భారతి, మావయ్య ధర్మారెడ్డి, నీరజ దంపతులు, దేవస్థానం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సరిహద్దు చెక్‌పోస్టుల తనిఖీ


నీలపల్లి–యానాం సరిహద్దు చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న ఆర్ఏఓ మునిస్వామి

యానాం: ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్– కేంద్రపాలిత ప్రాంతం యానాం సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన సరిహద్దు చెక్ పోస్టులను ఆర్ఏఓ మునిస్వామి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మద్యం, నగదు అక్రమంగా రవాణా కాకుండా నిరంతరం నిఘా ఉంచేలా మొత్తం 10 చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. చెక్ పోస్టులకు అనుసంధానంగా సీసీ కెమెరాలు సైతం ఏర్పాటు చేశామని, వాటి ద్వారా ఆర్ఏఓ ఆఫీసులో నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. చెక్‌పోస్టుల్లో 24 గంటలూ విధులు నిర్వహించేలా సిబ్బందిని సైతం నియమించామని చెప్పారు. ఇప్పటికే పారా మిలటరీ దళాల పర్యవేక్షణ సైతం కొనసాగుతుందన్నారు. నిబంధనల ప్రకారం రూ.50 వేలకు మించి నగదు తరలించరాదన్నారు.

వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలి


ఫ్యాను గుర్తుకు ఓటేయాలంటూ పార్టీ జెండాను ప్రదర్శిస్తున్న నాయకులు

అల్లవరం: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి బూత్ లెవల్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ అధ్యక్షతన దేవగుప్తంలోని సర్పంచ్ సాధనాల వెంకటరావు నివాసం వద్ద గురువారం మేము సిద్ధం, మా బూత్ సిద్ధం కార్యక్రమంపై జీవీకే చైర్మన్ తిక్కా ప్రసాద్ శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఈ ఐదేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను లబ్దిదారులకు వివరించి, సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓటు వేసేలా బూత్ సభ్యులు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, ఈతకోట సతీష్, కుడుపూడి సూర్యప్రకాష్, కుడుపూడి అప్పారావు, చింతా రామకృష్ణ, చిట్టూరి వెంకటనారాయణ, సాధనాల శ్రీను, కాశి బాలయోగి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి


సదస్సులో చిన్నారులతో ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వైద్యులు

అమలాపురం టౌన్: చిన్నారుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి దంత వైద్య నిపుణురాలు డాక్టర్ సంయుక్త సూచించారు. వరల్డ్ ఓరల్ హెల్త్ డే సందర్భంగా స్థానిక ఏరియా ఆస్పత్రి ప్రాంగణంలోని జిల్లా సత్వర చికిత్స కేంద్రం(డైస్)లో పిల్లల దంత వైద్యంపై జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు సదస్సుకు ముఖ్య అతిథిగా పాల్గొని పిల్లల ఆరోగ్య రక్షణపై పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా 60 మంది పిల్లలకు దంత పరీక్షలు చేసి టూత్ పేస్టలు, టూత్ బ్రెష్‌లు ఉచితంగా అందించారు. దంత సంరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను డాక్టర్ సంయుక్త పిల్లల తల్లిదండ్రులకు వివరించారు. జిల్లా సత్వర చికిత్స కేంద్రం కంటి వైద్య నిపుణుడు డాక్టర్ దేవకుమార్, ఏరియా ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఆర్ఏఓ మునిస్వామి

యానాం: భారత ప్రభుత్వం గ్యాలంట్రీ అవార్డు పోర్టల్ సౌజన్యంతో ఇటీవల నిర్వహించిన వీర్‌ఘాత 3.0 వ్యాస రచన, డ్రాయింగ్ పోటీల్లో యానాంకు చెందిన ఐదుగురు విద్యార్థులు బహుమతులు సాధించారని ప్రాంతీయ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్ ప్రవీణ్ తెలిపారు. ఎస్ఆర్‌సీఎస్ స్కూల్‌కు చెందిన మట్టపర్తి తేజస్విని షణ్మిత, అభిషేక్, రాజీవ్‌గాంధీ ప్రభుత్వ హైస్కూల్‌కు చెందిన విస్సీరిషిత, ఇందిరాగాంధీ ప్రభుత్వ పాఠశాల విద్యార్థి దాసరి మణిచందన జిల్లా స్థాయిలో ప్రతిభ చాటారన్నారు. అదేవిధంగా డ్రీమ్స్ స్కూల్ నుంచి రాష్ట్ర స్థాయిలో ఎస్.రిచల్ లిలియాన్ ప్రతిభ చాటారని వీరందరికి స్థానిక ఆర్ఏఓ మునిస్వామి బహుమతులు, ప్రశంసాపత్రం అందజేశారన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


పోషణ పక్వాడ్ కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీవో విజయకుమారి

అమలాపురం రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషక విలువలతో కూడిన పౌష్టికాహారం తీసుకుంటే తల్లీ బిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని అమలాపురం సీడీపీవో విజయకుమారి పేర్కొన్నారు. పౌష్టికాహార పక్షోత్సవాలను పురస్కరించుకుని రూరల్ మండలం కామనగరువు పరిధి ప్రతాప్ నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం జరిగిన పోషణ పక్వాడ్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గర్భిణులు, బాలింతలు రక్తహీనత బారిన పడకుండా పోషకాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కె.అన్నపూర్ణ, అంగన్‌వాడీ కార్యకర్తలు గిడ్డి సరితా జ్యోతి, దుర్గాబాయి, పద్మ, బి.బీమాబాయి, మంగాదేవి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులు ఓటేసేందుకు ఏర్పాట్లు

యానాం: యానాం, మాహే, కారైకల్, పుదుచ్చేరి రీజియన్లలో ఎన్నికల విధుల్లో ఉండే ప్రభుత్వ ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి ఎ.కులోతుంగన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు, గార్డులు, డ్రైవర్స్, కండక్టర్లు, క్లీనర్లు, వీడియోగ్రాఫర్లు, జర్నలిస్టులు, కంట్రోల్‌రూమ్ వర్కర్లు ఓటు వేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ వెబ్‌సైట్‌ల నుంచి సీఎం, మంత్రుల ఫొటోలను తొలగించారు.

ఏబీడీఎంలో నమోదు చేయించుకోవాలి

ముమ్మిడివరం: ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్(ఏబీడీఎం)కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్ల వివరాలతో పాటు వైద్యులు, స్టాఫ్ నర్సుల పేర్లు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని జిల్లా వైద్యాధికారి ఎం.దుర్గారావుదొర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా సంస్థలు పూర్తి వివరాలతో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. అలా చేయని సెంటర్లకు కొత్త రిజిస్ట్రేషన్, రెన్యువల్స్ నిలిపేస్తామని హెచ్చరించారు.

వరల్డ్ డౌన్ సిండ్రోమ్ డే

యానాం: వరల్డ్ డౌన్ సిండ్రోమ్ దినోత్సవాన్ని గురువారం స్థానిక ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ మానసిక దివ్యాంగ పాఠశాలలో స్కూల్ ఇన్‌చార్జి ఎస్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సతీష్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ జన్యు లోపాలతో పుట్టిన చిన్నారులకు సంగీతం, నృత్యం నేర్పిస్తే ఆసక్తి కనబరుస్తారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుశీల, మహేశ్వరి, వీరవేణి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

23న విగ్రహ ప్రతిష్ఠాపన

యానాం: పట్టణంలోని బైపాస్ రహదారిలో నూతనంగా నిర్మించిన దొడ్డిగంగమ్మ తల్లి ఆలయంలో ఈ నెల 23వ తేదీ నుంచి 25 వరకూ ఆలయ శిఖర ప్రతిష్ఠా మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

మెరుగైన యాజమాన్య పద్ధతులు పాటించాలి

తాళ్లరేవు: వనామీ రొయ్యల పెంపకంలో మెరుగైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులను సాధించవచ్చని శాస్త్రవేత్త డా.కార్తిరెడ్డి శ్యామల తెలిపారు. చొల్లంగిపేట పంచాయతీలో కేంద్రీయ మత్స్య శిక్షణ సంస్థ(సీఐఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఆక్వా రైతులకు మూడు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించారు. గురువారం శిక్షణ ముగింపు కార్యక్రమంలో శ్యామల మాట్లాడుతూ రొయ్యల పెంపకంలో మెళకువలు వివరించడంతో పాటు ఆక్వా రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో కాకినాడ కేంద్రం ఇన్‌చార్జ్, సీనియర్ శాస్త్రవేత్త డా.మురళీధర్, పి.అందె, సీఐఎఫ్ఐ డైరెక్టర్ వైస్ ఛాన్సలర్ డా.సీఎస్ రవిశంకర్, ప్రిన్సిపాల్ డా.జహంగీర్, శ్రీనివాసరావు, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

కూలర్ బహూకరించిన రాజీవ్, సుమ దంపతులు


కనకాలపేట ప్రాథమిక పాఠశాలకు అందించిన కూలర్‌తో విద్యార్థులు

యానాం: నియోజకవర్గ పరిధిలోని కనకాలపేట గ్రామానికి చెందిన సినీనటుడు కనకాల రాజీవ్, సుమ దంపతులు కనకాలపేటలోని కోన వెంకటరాజు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు గురువారం కూలర్‌ను బహూకరించారు. యాంకర్ సుమ పుట్టినరోజును పురస్కరించుకుని వేసవిలో పాఠశాలలో చదివే చిన్నారులకు ఉపకరించేలా 80 లీటర్ల సామర్థ్యం గల రూ.40 వేలు విలువ చేసే కూలర్‌ను వారి వ్యక్తిగత సిబ్బంది ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది రాజీవ్, సుమలకు ధన్యవాదాలు తెలిపారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు


క్రీడా పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థినులు

అమలాపురం టౌన్: స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో గురువారం క్రీడా పోటీలు నిర్వహించారు. కళాశాల పీఈటీ అరుణ పర్యవేక్షణలో కబడ్డీ, రన్నింగ్, కోకో విభాగాల్లో జరిగిన పోటీల్లో సుమారు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ స్థానం సాధించిన విజేతలకు 15 స్వర్ణ, 15 రజత పతకాలు అందించినట్లు యువ కేంద్రం వలంటీర్ బేబీ సరోజిని తెలిపారు. పోటీలకు అతిథిగా హాజరైన కళాశాల ప్రిన్సిపాల్ వీహెచ్ఎస్ కిషోర్‌కుమార్ చేతుల మీదుగా విజేతలకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

రెడ్డిపల్లిలో అగ్ని ప్రమాదం


బాధితులకు నగదు, నిత్యావసర సరకులు అందిస్తున్న సర్పంచ్ కరాటం ప్రవీణ్

అమలాపురం రూరల్: మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో గ్యాస్ లీకేజీ కారణంగా సంభవించిన అగ్ని ప్రమాదంలో గురువారం ఒక తాటాకిల్లు దగ్ధమైంది. అమలాపురం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో రూ.2 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించిందని అంచనా వేస్తున్నారు. ప్రమాదంలో సర్వం కోల్పోయిన చుట్టుగుళ్ల పుణ్యవతి, తవిటిక దుర్గాదేవిల కుటుంబసభ్యులకు సర్పంచ్ కరాటం ప్రసన్న ప్రవీణ్ దంపతులు రూ.5 వేల నగదు, నిత్యావసర వస్తువులు, దుస్తులు అందజేశారు. తాండవపల్లి సర్పంచ్ గంగుమళ్ల ఏసుబాబు బాధితులకు బియ్యం, కూరగాయలు ఇచ్చారు.

దివ్యాంగులకు సహకారం అందించాలి

ఉప్పలగుప్తం: సమాజంలో ప్రతిఒక్కరూ దివ్యాంగులకు చేతనైనంత సహకారం అందించాలని ఎంఈఓ సత్తి సత్యకృష్ణ అన్నారు. ప్రపంచ డౌన్ సిండ్రోమ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక గ్రామంలో మండల పరిషత్ పాఠశాలలో ఉన్న భవిత సెంటర్‌లో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులకు పుట్టుకతో అవయవ లోపాలు తలెత్తకుండా తల్లిదండ్రులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్యామల, ఐఈఆర్‌టీలు గంగాదేవి, వెంకటేష్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ కె.వెంకటేశ్వరరావు, సీజీవీ లక్ష్మీదేవి పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించాలి

ఉప్పలగుప్తం: భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని భారత రిప్లబికన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డీబీ లోక్ అన్నారు. మండలంలోని గొల్లవిల్లిలో గురువారం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కమిటీ అధ్యక్షునిగా దారా బాలకృష్ణను నియమించారు. కార్యక్రమంలో పందు రాజేష్, పరశరాముడు, యల్లమిల్లి అఖిల్, కొంకి వెంకట బాబ్జి, అశోక చక్రవర్తి పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిగా వైథిలింగం

యానాం: లోక్‌సభకు పోటీ చేసే అభ్యర్థుల జాబితాలను ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ గురువారం రాత్రి విడుదల చేశారు. పుదుచ్చేరి కాంగ్రెస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ వైథిలింగం పేరును ప్రకటించారు. దీంతో రెండోసారి ఆయన ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలబడనున్నారు.